కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం మే 1, 2026

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన రెడ్ క్రాస్ సభ్యులు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 30**





ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో ఒక హృదయాన్ని కదిలించే సేవా కార్యక్రమం నిర్వహించబడింది. అనారోగ్యంతో మరణించిన ఒక ఆటో డ్రైవర్ కుటుంబం ప్రస్తుతం శ్మశానవాటికలో నివసిస్తున్న పరిస్థితిని గుర్తించి, ఆ కుటుంబానికి – 10,000 (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవ రెడ్డి సంస్థ తరుపున అందించారు.
ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఊట్కూరి రాధ కృష్ణ రెడ్డి, ట్రెజరర్ పోరెడ్డి శ్రీహరి రెడ్డి, కమిటీ సభ్యుడు జీ. ఓంకార్ పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సెక్రటరీ , లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ బాలాజీ నగర్ సభ్యుడు ఊట్కూరి రాధ కృష్ణ రెడ్డి ఆ కుటుంబానికి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి, దాదాపు 18 మందికి ఒక రోజు భోజనం ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ సేవా కార్యక్రమంలో లయన్ హన్మండ్ల రాజిరెడ్డి, లయన్ ఎం. వెంకటేశ్వర్లు, లయన్ వి. రమణ రెడ్డి, లయన్ వి. గౌతమ్ పాల్గొన్నారు.

## అంబలి, మజ్జిగ వితరణ కార్యక్రమం ప్రారంభం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 30**





హిందూ సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 49వ డివిజన్లో భాగ్యనగర్ కాలనీ 25 వ తేదీ నుండి ప్రతిరోజు అంబలి, మజ్జిగ వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనీ,అందులో భాగంగానే గురువారం రోజున గాండ్ల మహదేవ్ పుట్టినరోజు సందర్భంగా 49వ డివిజన్లోని భాగ్యనగర్ లో అంబలి వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించి మాట్లాడుతూ ఎండాకాలంలో వేడిమిని తట్టుకోవాలంటే అంబలి ,మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్, బండ రమణారెడ్డి, బోయిన్పల్లి ప్రవీణ్ రావు, గాజా రమా శివరాం, కర్రె పద్మ అనిల్. సనాతన ధర్మ సేవా సమితి సభ్యులు భూమ రావు, ఈగం రవికుమార్, నారోతం రెడ్డి, లంబ సుధాకర్ రెడ్డి, నలమాచూ సంతోష్, రాజు, ముదుగంటి ప్రవీణ్, ఎన్నం ప్రవీణ్, అప్పాల శ్రీనివాస్, పచ్చునూరి నరేందర్, నందెల్లి జమున, శిరీష, విజయ లక్ష్మి, అమలా తదితరులు పాల్గొన్నారు.

## నాయిని చెరువు మత్తడి పరిశీలన -- వరద సమస్య నివారణకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం ప్రతిపాదన

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 30**





జమ్మికుంట పట్టణ పరిధిలోని నాయిని చెరువు మత్తడిని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఇరిగేషన్ డీఈ, మున్సిపల్ ఏఈలతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణం నుంచి వచ్చే వరద నీరు చెరువు వద్ద ఉన్న మత్తడికి చేరుకునే సమయానికి చెరువు ఇప్పటికే నిండిపోయి మత్తడి ప్రవహించే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. అలాంటి సమయంలో వరద నీరు మత్తడికి అడ్డుగా చేరడంతో నీటి ప్రవాహం నెమ్మదిగా మారి, చెరువు పరిసర ప్రాంతాల్లోని నివాస గృహాలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా చెరువు మత్తడి నీరు మరియు వరద నీరు వేర్వేరుగా వెళ్లే విధంగా ప్రత్యేకంగా రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనికి సంబంధించిన స్థల పరిశీలన నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, వరద ముప్పు లేకుండా పట్టణాన్ని రక్షించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు కమిటీ వేయాలి
## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఎక్కటి సంజీవరెడ్డి

- త్వరలో కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 30**
జమ్మికుంట/హైదరాబాద్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ( టీ యూ ఎఫ్ ) రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎక్కటి సంజీవరెడ్డి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల గుర్తింపుకు సంబంధించి కీలకమైన వినతిని సమర్పించారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన వేలాది మంది ఉద్యమకారులకు సరైన గుర్తింపు, గౌరవం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఉద్యమ సమయంలో తమ జీవితాలను పణంగా పెట్టి పోరాడిన కార్యకర్తలు ఇప్పటికీ గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారని సంజీవరెడ్డి మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వారికి న్యాయం జరిగేలా స్పష్టమైన విధానంతో కమిటీ ఏర్పాటు చేయడం అవసరమని వివరించారు.
ఈ సందర్భంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఉద్యమకారుల త్యాగాలు అపారమని, వారి సేవలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అంశాన్ని గంభీరంగా పరిశీలించి, త్వరలోనే కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.
అలాగే, ఎక్కటి సంజీవరెడ్డి ని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా నియమించిన సందర్భంగా మంత్రి స్వయంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన సేవలు ఉద్యమకారుల ఐక్యతకు దోహదపడతాయని ఆకాంక్షించారు.
ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగగా, ఉద్యమకారుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ, సంక్షేమ కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవం, గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మరోసారి స్పష్టం చేశారు.

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గ పర్యటన.

- –డాకూర్ గ్రామంలో హెల్త్ క్యాంప్ ను ప్రారంభించారు.
- –ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రజారోగ్యాన్ని బలోపేతం చేస్తున్నాం
- –ప్రజలు డాక్టర్ సూచనలు లేకుండా పెయిన్ కిల్లర్లను వాడొద్దు
- –ఆందోల్ ను హెల్త్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నాం
- –రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి





**కరపత్రం ప్రతినిధి అందోలు**
ఆందోల్ మండలం డాకూర్ గ్రామంలో ధర్మశాస్త్ర ఫౌండేషన్ సహార హాస్పిటల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. క్యాన్సర్, డయాలసిస్, గుండె సంబంధ , ఎన్ సి డి చికిత్స లను కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్నామన్నారు. డాకూర్ గ్రామానికి చెందిన ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడానికి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు వెన్ను, కీళ్ల నొప్పుల కోసం డాక్టరు సూచనలు లేకుండా విరివిగా పెయిన్ కిల్లర్ మందు గోళీలు వాడటం వల్ల మూత్రపిండాల లో సమస్యలు వస్తాయని మంత్రి వెల్లడించారు. డాక్టర్ సూచనలు, మందుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందు గోలిలు వాడొద్దని సూచించారు. గ్రామ ప్రజలు వైద్య చికిత్సల కోసం దగ్గర్లో ఉన్న జోగుపేట ప్రభుత్వ ఆసుపత్రి, సంగారెడ్డి లోని జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు ఉచితంగా అందిస్తున్నామన్నారు ప్రజలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు.
హైదరాబాదులో క్యాన్సర్ నివారణ కోసం సహారా ఆస్పత్రిలో గ్రామానికి చెందిన సాహసం రాష్ట్ర అధ్యక్షులు, సామాజిక కార్యకర్త డా . ముప్పారం ప్రకాశం ను పరామర్శించడం జరిగిందన్నారు. సామాజిక కార్యకర్త ముప్పారం ప్రకాశం క్యాన్సర్ చికిత్సకు సహారా ఆసుపత్రిలోని వైద్యులు సరైన చికిత్సను అందించడంతో ప్రకాశం త్వరగా కోలుకున్నారన్నారు. డా. ముప్పారపు ప్రకాశం రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. క్యాన్సర్ అని తెలిసిన వెంటనే ప్రకాశానికి విలువైన క్యాన్సర్ నివారణకు అవసరమైన మందులను ఉచితంగా అందించి అండగా నిలిచారని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి కృతజ్ఞతలు తెలిపారు. సహారా ఆసుపత్రి వారు డాకూర్ గ్రామంలో మెడికల్ క్యాంపు పెట్టి ప్రజల ఆరోగ్య స్థితిగతులను స్క్రీనింగ్ చేయడాన్ని మంత్రి స్వాగతించారు. ఆశ వర్కర్లను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు లో పాల్గొన్న సహారా హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది కి ప్రశంస పత్రాలను అందించారు. టీ సీ
ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డిఎంహెచ్ఓ వసంత్ కుమార్, ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు హెల్త్ క్యాంపులో పాల్గొన్నారు.

## జమ్మికుంట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పులి వెంకట్ బాధ్యతలు స్వీకరించారు

- కరీంనగర్ పోలీస్ విభాగంలో కీలక మార్పులు




**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 30**
కరీంనగర్ జిల్లా పోలీస్ విభాగంలో కీలక అధికారుల బదిలీలతో పరిపాలనా మార్పులు చోటుచేసుకున్నాయి. జమ్మికుంట పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన లక్ష్మీనారాయణ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో పులి వెంకట్ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మార్పుతో జమ్మికుంట రూరల్ పరిధిలో పోలీసింగ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన పులి వెంకట్ మాట్లాడుతూ, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం, చట్ట పరిరక్షణలో కఠినంగా వ్యవహరించడం, శాంతిభద్రతలు కాపాడటం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌ను ప్రజలకు మరింత అందుబాటులో ఉంచి, సమస్యల పరిష్కారానికి వేగంగా స్పందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చోటుచేసుకునే చిన్నచిన్న వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించి, నేరాలను ముందుగానే అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా యువతలో చైతన్యం పెంపొందించడం, మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక పహారా బృందాలను ఏర్పాటు చేసి, విద్యార్థుల రక్షణ కోసం పాఠశాలల పరిసర ప్రాంతాల్లో గస్తీని పెంచుతామని వెల్లడించారు. రాత్రి వేళల్లో గస్తీ బలోపేతం చేసి అనుమానాస్పద కదలికలపై కఠినంగా స్పందిస్తామని చెప్పారు.
ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు “మీతో పోలీస్” అనే భావనతో ముందుకు సాగుతామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంతో తీసుకొని పారదర్శకంగా విచారణ జరిపిస్తామని సీఐ పులి వెంకట్ పేర్కొన్నారు. పోలీస్–ప్రజల మధ్య నమ్మకం పెంచే దిశగా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, పోలీస్ సిబ్బంది నూతన సీఐ పులి వెంకట్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన సేవలతో ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, న్యాయబద్ధమైన పాలన అందించాలని సూచించారు.
మరోవైపు బదిలీపై వెళ్లిన సీఐ లక్ష్మీనారాయణ సేవలను స్థానికులు కొనియాడారు. ఆయన తన పదవీకాలంలో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించి ప్రజల విశ్వాసాన్ని పొందారని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో చూపిన చురుకుదనం, సమస్యల పరిష్కారంలో తీసుకున్న వేగవంతమైన చర్యలు పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చాయని అభిప్రాయపడ్డారు.
లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అమలు చేసిన పలు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు, శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకున్న కఠిన నిర్ణయాలు ప్రజలకు భరోసా కల్పించాయని గుర్తుచేశారు. ఆయన సేవలను స్మరించుకుంటూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.
ఈ మార్పులతో జమ్మికుంట రూరల్ సర్కిల్‌లో కొత్త దశ ప్రారంభమైందని, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అందుతుందని స్థానిక వర్గాలు భావిస్తున్నాయి. కొత్త సీఐ పులి వెంకట్ నాయకత్వంలో నేరాల నియంత్రణ, మహిళల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, యువతలో అవగాహన పెంపు వంటి రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని ఆశిస్తున్నారు.

## రుణాల ఎగవేత కేసులో రఘురామకు ఊరట అరెస్ట్ చేయవద్దంటూ ఢిల్లీ కోర్టు బెయిల్

ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజుకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఊరట దక్కింది. బ్యాంకుల రుణ ఎగవేత కేసులో రఘురామకు బెయిల్ మంజూరు చేసింది. కోర్టుకు వ్యక్తిగతంగా రఘురామ గురువారం హాజరయ్యారు. ఈ కేసు దర్యాప్తు సమయంలో అరెస్ట్ చేయొద్దని ఆయనకు న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. రూ. 50,000 షురిటీ బాండ్‌పై బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఆయనతో పాటు మరో నలుగురు నిందితులకు కూడా ఊరట లభించింది. సీబీఐ అధికారులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సుమారు 15 వేల పేజీలకు పైగా ఉండటంతో, ఆ పత్రాల పరిశీలనకు నిందితుల తరపు న్యాయవాదులు సమయం కోరారు. పత్రాల పరిశీలన (ఛూఇసబీబితినా) కోసం తదుపరి విచారణను జులై 6, 2026కి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కంపెనీల లిక్విడేషన్ స్థితిగతులను తెలపాలని సంబంధిత అధికారులను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశించింది